


## రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి ఘన స్వాగతం

రాష్ట్రంలో విడిది చేసేందుకు శనివారం బేగంపేట విమానా శ్రయయానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పూల బొకే అందించి ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ఇక్కడ ఉన్నంత కాలం ఆమె వెంట మంత్రి సీతక్క ఉండనున్నారు.
– వరంగల్ వాయిస్, హైదరాబాద్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 19
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
సెప్టెంబర్ 28, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





# స్మార్ట్ బస్ షెల్టర్లు.. ఏడబాయే ?

వివరాలు2లో..

- ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- నిలువ నీడ లేక ఇబ్బందులు
- ఎండలోనే ప్రయాణికుల ఎదురు చూపులు
- పట్టించుకోని బల్దియా పాలకవర్గం
- బస్ స్టేషన్ల ఏర్పాటులో స్పష్టత కరవు
- అధికారుల నిర్లక్ష్యంతో అవాంతరాలు

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో 'స్మార్ట్ సిటీ మిషన్' కార్యక్రమం కింద హైదరాబాద్ తరహాలో మొత్తం 121 ఆధునిక స్మార్ట్ బస్ షెల్టర్లు నిర్మించాలని నిర్ణయించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో బాటసారులకు నిలువ నీడలేక ఎండలోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల కొద్ది ఎండలో వేచి చూడడంతో ఆ తీవ్రతను తట్టుకోలేక వయసు మళ్లిన వారు సొమ్మసిల్లి పడిపోయిన సంఘటలూ ఉన్నాయి. స్మార్ట్ బస్ షెల్టర్ ఏమోగాని ఉన్న షెల్టర్ పోయే అని ప్రయాణికులు మధనపడుతున్నారు. మూడు సంవత్సరాల క్రితమే ఒక ప్రైవేట్ సంస్థ బస్ షెల్టర్ల రూపకల్పన పనులను ప్లాన్ సిద్ధం చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామంటూ ప్రకటించిన బల్దియా పాలకులు తర్వాత పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలాయి. అసలు నగరంలో ఎక్కడెక్కడ ఆధునిక స్మార్ట్ బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్న ప్రక్రియనే బల్దియా అధికారులు పూర్తి చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బల్దియా పాలకుల పనితీరుపై జనం దుమ్మెత్తి పోస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



2లో..

## తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి | పీజీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవం

## ఎన్నికలు ఏవైనా.. ఎగరాల్సింది కాంగ్రెస్ జెండానే

- పార్టీకి పునాది కార్యకర్తలే
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికీ చేరాలి



2లో..

# స్మార్ట్ బస్ షెల్టర్లు.. ఏడబాయే..?

**ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు**

**నిలువ నీడ లేక ఇబ్బందులు**

**ఎండలోనే ప్రయాణికుల ఎదురు చూపులు**

**పట్టించుకోని బల్దియా పాలకవర్గం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో 'స్మార్ట్ సిటీ మిషన్' కార్యక్రమం కింద 121 ఆధునిక స్మార్ట్ బస్ షెల్టర్లు అందుబాటులోకి తెస్తామంటూ ప్రకటించిన బల్దియా పాలకులు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. నగర పరిధిలో 121 బస్ షెల్టర్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయలన్న విషయంలోనూ స్పష్టత కరువైంది. రెండు సంవత్సరాల్లోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామంటూ మంటూ ప్రకటించినా బస్ షెల్టర్ల పనులు అనుకున్న రీతిలో ముందుకు సాగడం లేదు. ఈ ప్రాజెక్ట్ పనులను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్దతిలో నిర్మించాలని నిర్ణయించినా అధికారుల నిర్లక్ష్యంతో అవాంతరాలు తప్పడం లేదు. అసలు పనులు జరుగుతున్నాయా లేదా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

## డిజైన్ పూర్తి..

హైదరాబాద్ కు చెందిన ఒక ప్రైవేట్ సంస్థ బస్ షెల్టర్ల డిజైన్ ను పూర్తి చేసింది. ఈ ఏజెన్సీ బస్ షెల్టర్‌లను డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ ఆధారంగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్ట్ (పీపీపీ) కింద నిర్మించాలని నిర్ణయించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 162 ఆధునిక బస్ షెల్టర్లను ఏర్పాటు చేయడానికి జీబ్ల్యుఎంసీ ప్రతిపాదనలు పంపినప్పటికీ సంబంధిత వర్గాలు 121 షెల్టర్లకు మాత్రమే అనుమతులు మంజూరు. చేశారు.



## హైదరాబాద్ తరహాలో..

ప్రతిపాదిత బస్ షెల్టర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ల తరహాలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ ఆధునిక షెల్టర్లలో బస్ రూట్‌లు, బస్సు నంబర్లు, సమయాలు, క్యూఆర్ స్కానింగ్ కోడ్‌లు, నిఘా కెమెరాలు, మొబైల్ ఛార్జింగ్ పాయింట్‌లు, చెత్త డబ్బాలు, బస్సుల ప్రకటన, ఇతర సదుపాయాలకు సంబంధించిన డిజిటల్ స్క్రీన్‌లను అమర్చనున్నట్లు మేయర్ గుండు సుధారాణి ప్రకటించారు. వాటిలో కొన్నింటిలో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఇప్పటికే స్థలాలను గుర్తించారు.

## ఇబ్బందుల్లో జనం..

నగరంలో 121 స్మార్ట్ బస్ షెల్టర్ల ఏర్పాటు ప్రక్రియను హైదరాబాద్ కు చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో వారు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న బస్ షెల్టర్లన్నింటినీ తొలగించారు. వాటి స్థానంలో కొత్త వాటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఐరన్ నిర్మాణాలను పూర్తి చేశారు. బిల్లుల చెల్లింపులో బల్దియా చేతులెత్తడంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యంతరంగానే నిలిపి వేశారు. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో కేవలం ఐరన్ గ్రిల్స్ మాత్రమే ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ తర్వాత పనులను చేపట్టేందుకు ససేమిరా అంతున్నారు. దీంతో నగరంలోని ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సలకోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. వరంగల్ ప్రాంతంలోని గోపాలస్వామి గుడి, పోచమ్మ మైదాన్ ప్రాంతంలో నిత్యం ప్రయాణికులు ఎండలో ఎండుతూ బల్దియా అధికారులను తిట్టుకుంటున్నారు. గతంలో కనీసం షెల్టర్ అయినా ఉండేది..ఇప్పుడు అది కూడా లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా పాలకవర్గం, అధికారులు తగిన చర్యలు తీసుకొని త్వరిత గతిన స్మార్ట్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



# తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ

**కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి**

**పీజీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణా ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో శనివారం సుబేదిరిలోని యూనివర్సిటీ పీసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. బతుకమ్మను పేర్చి కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు ఆట పాటలతో సందడి చేశారు. ముఖ్యంగా అమ్మాయిలు తెలంగాణ సాంప్రదాయ నేపథ్యంలో వచ్చిన బతుకమ్మ పాటలు పాడుతూ పూలను పూజించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ అంటే పోరాటం.. బతుకమ్మ అంటే తెలంగాణ ఇంటిల్లిపాది చేసుకొని అద్భుత ఉత్సవం.. ఇది మన తాతల నుంచి వచ్చిన సాంప్రదాయ పండుగ అన్నారు. ప్రపంచంలో ఏ పండుగలో కూడా పూలను పూజించరు ఒక్క బతుకమ్మ పడుగకు మినహా అన్నారు. అది బతుకమ్మ ఉత్సవాల భాగంగా తెలంగాణలో జరుపుకోవడం మనమందరం గర్వించే విషయమన్నారు. ఇలాంటి అద్భుతమైన సన్నివేశం ఈ కళాశాలలో జరిగినందుకు విద్యార్థులను అభినందించారు. ఈ ఉత్సవాల్లో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. పి.వరలక్ష్మి, డాక్టర్ బి. లలిత కుమారి, ఆచార్య జి.షమితా, డాక్టర్ టి. శాస్త్రి, ఆచార్య టి.సవితా జ్యోత్స్న, అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ సరిత, రజిత, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ వినోద , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఓ.రవీందర్, డాక్టర్ ఇ.రాజు, డాక్టర్ మల్లేష్, డాక్టర్ వీరేందర్, డాక్టర్ దేవోజి, డాక్టర్ నరేందర్, డాక్టర్ కిరణ్, డాక్టర్ నవీన్, డాక్టర్ విజయ్, డాక్టర్ ఉప్పయ్య, డాక్టర్ శంకర్, డాక్టర్ మురళి, డాక్టర్ రాజు, రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఏవైనా.. ఎగరాల్సింది కాంగ్రెస్ జెండానే

- పార్టీకి పునాది కార్యకర్తలే
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికీ చేరాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండా మాత్రమేనని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. పరకాలలోని లలిత కన్వెన్షన్ హాలో శనివారం నిర్వహించిన పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశానికి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండానే ఎగరాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలలో నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జరిగినవి సెమీ ఫైనల్స్ మాత్రమేనని..ఇప్పుడు జరగబోయే ఎన్నికలే ఫైనల్స్ అని అన్నారు. ఈ ఫైనల్స్ లో గెలవాల్సింది కాంగ్రెస్ పార్టీయే అని అందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికే అవకాశాలు దక్కుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాన్ని పెంపోదించుకోవాలి..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** యువత ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపోదించుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరంగల్ లోని పోతన విజ్ఞాన పీఠంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్బంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2024 కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవితో కలిసి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు యూత్ ఫెస్టివల్స్ ఎంతగానో ఉపయోగపడుతాయాని అన్నారు. వరంగల్ కు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. వరంగల్ లో కవులు, కళాకారులు, క్రీడాకారులు, రచయితలకు కొదవలేదన్నారు. యువత ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని సూచించారు. చదువుపై ఎక్కువ దృష్టి పెట్టాలని, సోషల్ మీడియాకు అడిక్ట్ కావద్దని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సంస్కృతిక పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారులు, యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# యువత శక్తిని నిర్వీర్యపరుస్తున్న పాలకుల విధానాలు

## ఏఐఫ్‌డీవై రాష్ట్ర నిర్మాణ బాధ్యులు పెద్దారపు రమేష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశ అభివృద్ధికి వెన్నెముక అయిన యువత శక్తిని పాలకుల విధానాలు నిర్వీర్యపరుస్తున్నాయని ఏఐఎఫ్ డీవై రాష్ట్ర నిర్మాణ బాధ్యులు పెద్దారపు రమేష్ అన్నారు. నేడు అండర్ బ్రిడ్జి వద్ద గల ఓంకార్ భవన్ లో వరంగల్ షాహిద్ భగత్ సింగ్ 117 వ జయంతి సందర్భంగా ఏఐఎఫ్ డీవై రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అయినప్పటికి సుదీర్ఘంగా పరిపాలించిన కాంగ్రెస్, పదేళ్లు పరిపాలన చేసిన బీజేపీ తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేశాన్ని, రాష్ట్రాలను పరిపాలిస్తూ దేశ రాష్ట్రాల అభివృద్ధికి వెన్నెముక అయిన యువత శక్తిని నిర్వీర్యపరిచే మతోన్మాద, ఆర్థిక, విదేశీ, విష సంస్కృతి లాంటి అనేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, గ్రామీణ నిరుద్యోగులకు సాగుభూమి పంపిణీ, ఉపాధి అవకాశాల కోసం ఏఐఎఫ్ డీవై భవిష్యత్తు కార్యచరణను ఈ సమావేశం ప్రకటించిందని తెలియజేశారు. అక్టోబర్ 7న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరుద్యోగ, యువజన వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల ఎదుట నిరసన తెలిపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కలెక్టర్ల ద్వారా వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించినట్లు తెలియజేశారు. ఏఐఎఫ్ డీవై రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రవి, సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి నీల రవీందర్ అధ్యక్ష వర్గంతో జరిగిన ఈ సమావేశంలోఏ ఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, సంఘ రాష్ట్ర నాయకులు మేక మోహన్ రావు, డి.మధుసూదన్, వస్కుల కిరణ్, డి.శ్రీనివాసులు, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంరెడ్డి హంస రెడ్డి, ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె కుమారస్వామి, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకులు నర్రా ప్రతాప్, రాష్ట్ర నాయకులు పోతుగంటి కాశి, మాస్ సావిత్రి, ఏఐఎఫ్ టీడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ, రాష్ట్ర నాయకురాలు కనకం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సొసైటీ చైర్మన్‌కు పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** చేనేత మండల కన్వీనర్, చేనేత పెంచికలపేట సొసైటీ చైర్మన్ కంద కట్ల సదానందం అనారోగ్యంతో హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ చికిత్స పొందుతుండగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి పరామర్శించారు. స్వయంగా ట్రీట్మెంట్ సలహా, సూచనలు ఇవ్వడం జరిగింది. ఆయన వెంట మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పు గల్ల శ్రీకాంత్ రెడ్డి, కామగాని కిరణ్, రవితేజ, కాగితాల సాయికుమార్, బత్తుల సుమంత్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఎంపీడీఓ



**వరంగల్ వాయస్, పరకాల :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి క్రీడల ఎంపిక ఈ సంవత్సరం హనుమకొండ సెయింట్ గాబ్రియేల్ స్కూల్ ఆవరణలో జరిగింది. పరకాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఏ.తేజశ్విని, 9వ తరగతి విద్యార్థిని బి.అనూష ఫుట్ బాల్ జట్టుకు ఎంపికయ్యారు. వారు అక్టోబరు 3 నుంచి 5 వరకు మెదక్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పరకాల ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి సంధి కరిత తెలుపగా పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు వెంటనే వారిని మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అవార్డు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నామాని సాంబయ్య, పరకాల ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు సీహెచ్ శైలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయ సాధనే ధ్యేయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారత యువజన సమాఖ్య వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్‌లో శనివారం షహీద్ కామ్రేడ్ భగత్‌సింగ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ ముఖ్య అతిథిగా పాల్గొని భగత్ సింగ్ ఫొటోకి పూల దండ వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ మహనీయుల త్యాగాల వల్లే దేశం స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తోందన్నారు. భగత్ సింగ్ వంటి దేశభక్తులు, అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు యువత కట్టుబడి ఉండాలన్నారు. కామ్రేడ్ భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, కామ్రేడ్ భగత్‌సింగ్ కలల దేశమే మన ధ్యేయమని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, ఏఐవైఎఫ్ నగర నాయకులు మొహమ్మద్ రహమత్, మొహమ్మద్ అబ్బు, బాలు రాజు, ఓదేలు, ఆంజనేయులు, దేవేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ ను శనివారం న్యాయమూర్తి సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు సమన్వయంతో వ్యవహరించి రాజీ మార్గం ద్వారా అన్ని కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్ లో క్రిమినల్ కేసులు, బ్యాంకు దావాలు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, ప్రామిసరీ నోట్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని, వివిధ కేసులతో ఏళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారుల పాలిట లోక్ అదాలత్ వరంలా మారి శాశ్వత పరిష్కారం చూపెడుతుందన్నారు. లోక్ అదాలత్ లో ఒక్కసారి కేసు పరిష్కారమైతే మరోసారి అదే కేసు విషయమై కోర్టు మెట్లు ఎక్కే అవసరం లేదన్నారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి తిరుపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమర్తి వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మాకర్ రెడ్డి, డీఎస్పీ తిరుపతి రావు, సురేష్, జిల్లా సీనియర్ న్యాయమూర్తి పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కొత్తవాడలోని గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. దాతలు చకిలం అవినాష్, వై.జయంత్ "ఏ.జె.పెడల్స్"సంస్థ తరఫున తల్లిదండ్రులు లేని పేద విద్యార్థిని విద్యార్థులకు ఈ సైకిళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మట్టేవాడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తుమ్మ గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు ఆర్థికపరంగా పేదలే కానీ, మేధస్సులో ఎంతో ధనికులని, అన్ని అవసరాలు, సౌకర్యాలు కల్పిస్తే సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేవారు వీరే అన్నారు. ఎందరో మహానుభావులు ప్రభుత్వ పాఠశాలలో చదివి గొప్ప గొప్ప స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి, ఎం.భూపాల్, బుచ్చిరెడ్డి, సరోజినీ దేవి, జే.రాజు, మహమ్మద్ అప్సర్, రమాదేవి, సంపత్ కుమార్, శకుంతల దేవి, జ్యోతి, ఉమాదేవి, రమాదేవి, సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలోని పరకాల టౌన్, రూరల్ లోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ. 40,04640 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు శనివారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలు నిలుస్తున్నాయన్నారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా నిరుపేదలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు కూడా అవినీతికి పాల్పడిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులుగా ఉన్న ప్రతి పేదవాడి ఆదుకోవాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు కూడా మంజూరు చేసి అందించిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరఫున ఎమ్మెల్యే రేవూరి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పీడీఎస్‌యూ 50 వసంతాల సభను విజయవంతం చేయాలి

## కాకతీయ యూనివర్సిటీలో పోస్టర్స్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ ) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శనివారం కాకతీయ యూనివర్సిటీ వీసీ బిల్డింగ్ ఎదుట పీడీఎస్ యూ 50 వసంతాల పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, బార్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్ కుమార్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి భాదవత్ రాజులు పోస్టర్స్ ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ ) గత ఐదు దశాబ్దాలుగా శాస్త్రీయ విద్య సాధన లక్ష్యంగా విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నదన్నారు. ఈ పోరాటంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, కోల శంకర్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, సాంబయ్య వంటి విద్యార్థి నాయకులు వారి ప్రాణాలను ఈ ఉద్యమంలో వదులుకొని అమరులైనారని అన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం కూడా కార్పొరేట్, ఎంఎన్ సీలకు అప్పజెప్పే పనిలో ఉందన్నారు. ఎన్ఈపీ-2020 పేరుతో విద్యారంగంలో మొత్తం అశాస్త్రీయ భావజాలన్ని ప్రవేశపెడుతుందన్నారు. విద్యారంగాన్ని కనీస నిధులు కూడా కేటాయించకుండా ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా ప్రయాణిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా విద్యారంగాన్ని పట్టించుకునే స్థితిలో లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు వీసీలను నియమించకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నాలుగు ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇచ్చిందంటే ప్రైవేట్ విద్యాసంస్థల మీద ఉన్న ప్రేమ ప్రభుత్వ యూనివర్సిటీల మీద లేదన్నారు. ఈ క్రమంలో విద్యా కాషాయికరణ, ప్రైవేట్, కార్పొరేటీకరణలకు వ్యతిరేకంగా, అందరికీ సమాన, నాణ్యమైన విద్య కోసం ఉద్యమిస్తున్న పీడీఎస్ యూ 50 వసంతాల సభలను విద్యార్థులు, పీడీఎస్ యూ పూర్వ విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు, అడ్వకేట్ నబీ, అక్షర శక్తి సీఈఓ ముర్క రవి, పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబ, సహాయ కార్యదర్శి మిశ్రిన్ సూల్తానా, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రంజిత్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు అర్జున్, వంశీ, డానియల్, పవన్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు న్యాయం చేయండి

## కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత




**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్లలో టీఎస్ జెన్ కో బొగ్గు తవ్వకాలలో ఇళ్లు కోల్పోయిన భూ నిర్వాసితులు తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు కోల్పోయిన ఇళ్లకు నష్ట పరిహారం అందించాలని కోరుతూ శనివారం తాడిచెర్ల పర్యటనకు వచ్చిన భూపాలపల్లి జిల్లా కలెక్టరు రాహుల్ శర్మకు తాడిచెర్ల భూ నిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, భూ నిర్వాసితులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డివిజన్ అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి స్థానిక కమ్యూనిటీ హాల్ లో శనివారం డివిజన్ అభివృద్ధి ప్రణాళిక సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి కార్యాచరణకు పలు సూచనలు అధికారుల వద్ద నుంచి తీసుకోవడం జరిగింది. అదేవిధంగా అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు సహకారంతో డివిజన్ ను మరింత అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ నిర్ణయించారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ రవితో పాటు ఏఈ ముస్సామిల్, ఎలక్ట్రిక్ డిపార్ట్ మెంట్ ఏఈ అశ్విన్, సూపర్ వైజర్ భాస్కర్, ఇన్ స్పెక్టర్ కుమార్, వార్డు ఆఫీసర్ రాజేశ్వరీ, మున్సిపల్ జవాన్ జీవన్, బిల్ కలెక్టర్ రజినీకాంత్, శానిటరీ సిబ్బంది, మలేరియా సిబ్బంది, వీధిలైట్ల సిబ్బంది, విద్యుత్ శాఖ ఎంపీటీసీఎల్ సిబ్బంది, రేషన్ షాప్ సిబ్బంది, అంగన్వాడీలు, ఆర్పీలు, ఆశా వర్కర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయముఖిలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్), వరంగల్ మెడికవేర్ హాస్పిటల్స్ వారు హెల్త్ చెకప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాలైన పరీక్షలు చేశారు. పరీక్షల్లో భాగంగా జీఆర్ బీఎస్, బీఎంఐ, ఈసీజీ, బీపీ, పల్స్ రేట్ వంటి మొదలగు పరీక్షలు నిర్వహించి వారికి తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు చెబుతూ వివరిస్తూ ఆహారంలోని మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పరీక్షలు నిర్వహించామని మెడికవర్ డాక్టర్ నిహారిక తెలియజేశారు. కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 150 అధ్యాపకులు, 300 విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. హెల్త్ చెకప్ కు విద్యార్థులు, కళాశాల సిబ్బంది అందరూ విరివిగా వచ్చి వారి ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్ రెడ్డి , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస్ రావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ హమీద్ పాషా, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ వరుణ్, డాక్టర్ రామకృష్ణా రెడ్డి, డాక్టర్ పున్నంచందర్, డాక్టర్ విష్ణు, డాక్టర్ ఎస్.వాసుదేవ మూర్తి, డాక్టర్ జి.అనిల్ కుమార్, మెడికవేర్ హాస్పిటల్స్ నర్సింగ్ స్టాఫ్ మాధురి, నీల వేణి, సందీప్, కళాశాల అధ్యాపక బృదం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పసి పిల్లలపై పెట్టిన కేసును రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ రాంనగర్ లోని కానిస్టేబుల్ కార్ పై గీతలు గీశారని 8 మంది పసి పిల్లలపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని జాతీయ బీసీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నేరం చేసిన వాళ్లకే అవకాశం ఇస్తారు. అలాంటిది అభం శుభం తెలియని పసి పిల్లలపై కేసులను నమోదు చేయడం చాలా తప్పని అన్నారు. పోలీస్ అధికారులు ఇలాంటి కేసులపై ఆలోచించాలని కోరారు.

# వేముల కనకయ్య సేవలు మరువలేం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ 19వ డివిజన్ కు చెందిన వేముల నాగరాజు తండ్రి వేముల కనుకయ్య దశదినకర్మకు లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కమిటీ సభ్యులు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుస్స కృష్ణ, దాసి శివకృష్ణ, పసునూటి శ్రీకాంత్, క్యాతం శ్రీనివాస్, మండల చంద్రశేఖర్, వంగరి రవి, మామిడాల సతీష్, క్యాతం రవీందర్, గాజుల రాజేష్, కానుగంటి పవన్ కుమార్, జూలూరి నాగరాజు, గోనె మధుకర్, గుండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారి బైరి సరళకు సన్మానం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలం నూతన మండల విద్యాశాఖ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు బైరి సరళను ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, ఉపాధ్యాయులు రాగి శశిధర్, కె.సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సత్కరించారు. చెన్నారావుపేట మండలంలో విద్యారంగాన్ని పురోభివృద్ధిలో తీసుకుని వెళ్లుటలో కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , ఉపాధ్యాయ సంఘాల సహకారంతో చెన్నారావుపేట మండలాన్ని విద్యారంగంలో అగ్రగామిగా రూపొందించడం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని నూతన ఎంఈఓ సరళ తెలిపారు.

# క్రీడలు మానసికోలాసాన్ని పెంపొందిస్తాయి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని చెన్నారావుపేట మండల విద్యాశాఖ అధికారిని, ఎస్జీఎఫ్ క్రీడల నిర్వాహణ అధ్యక్షురాలు సరళ, చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట, నెక్కొండ రెండు మండలాల విద్యార్థులకు అండర్-14, అండర్-17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను మండలంలోని జల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల బహుమతుల దాత, చెన్నారావుపేట సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ బాదావత్ విజేందర్, మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ, క్రీడల నిర్వహణ కార్యదర్శి, జల్లి జిల్లా పరిషత్ పాఠశాల పీడీ భిక్షపతి, వ్యాయామ ఉపాధ్యాయులు, పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రత్నాకర్



**వరంగల్ వాయిస్, నడికూడ :** ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చుక్క రత్నాకర్ మహారాజ్ ను నియమించారు. శనివారం ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చుక్క రత్నాకర్ ను పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీ జెండా దిమ్మేలు, శిలాఫలకాల పరిరక్షణ కమిటీ స్టేట్ ఇంచార్జిగా నియమించారు. హనుమకొండ జిల్లా, నడికూడ మండలం, కౌకొండ గ్రామానికి చెందిన చుక్క రత్నాకర్ మహారాజ్ డీఎస్పీ ఉద్యమ ప్రస్థానం గత 15 సంవత్సరాల నుంచి విశారదన్ మహరాజ్ నాయకత్వంలో ఉద్యమ, పార్టీ ఆదేశాల ప్రకారం నియమ నిబంధనలకు లోబడి క్రమశిక్షణతో జిల్లాలో పనిచేసి పార్టీని విస్తరించారు. రత్నాకర్ తన పనిని గుర్తించినందుకు విశారదన్ మహారాజ్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ కోడేపాక ప్రతాప్, బుస్స తిరుపతి, మేకల ప్రవీణ్, దినేష్, క్రాంతి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా పరకాల నడికూడ మండలాల 24 గ్రామాలలో మంచినీటి సహాయకులకు ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంపీడీఓ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించే ఉద్దేశ్యంతో గ్రామంలో మంచినీటి సహాయకులకు శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వారికి సర్టిఫికేట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ మధుకుమార్, ఏఈఈ రమణయ్య, గ్రిడ్ ఏఈ నాగరాజు, నడికూడ, పరకాల మండలాలకు సంబంధించిన మంచినీటి సహాయకులు హాజరయ్యారు.

## అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్‌గా ఎంపికైన నరేష్

### అభినందించిన కేయూ వీసీ, రిజిస్ట్రార్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ జియాలజి విభాగ విద్యార్థి నరేష్ టీజీపీఎస్సీ ద్వారా నిర్వహించిన అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తెలంగాణ రాష్ట్ర జల వనరుల శాఖలో అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్నిఅందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ ను వైస్ ఛాన్సలర్ ఇంచార్జ్ కరుణ వాకాటి, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, విభాగ అధిపతి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## డీజీపీని కలిసిన పోలీస్ అమరవీరుల కుటుంబాలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ పోలీస్ అమరవీరుల కుటుంబాలకు చెందిన మాకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పోలీసు శాఖలో పని చేసి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటుగా హనుమకొండ జిల్లా కాజిపేట్ మండల కేంద్రంలో సర్వే నంబర్ 27లో 14 మంది పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇంటి స్థలం, పట్టా సర్టిఫికెట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేసి ఉత్తర్వులు ద్వారా జరీచేశారు. ఇందుకు గాను, తాము ఎంతో వ్యయ ప్రయాసలు పడి ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. కానీ, మాకు ఇటీవల ఈ గృహాలు ఎఫ్ టీఎల్ పరిధిలో ఉన్నాయని నోటీసులు జారీ చేయగా మేము తీవ్ర ఆందోళనకు గురయ్యామని, వెంటనే నిన్న తెలంగాణ డీజీపీని, ఐజీ ఇంటెలిజెన్స్ ను కలిసి సమస్యను వివరించామన్నారు. డీజీపీ స్పందించి వెంటనే వరంగల్ పోలీస్ కమిషనర్ కు ఫోన్ లో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ అమరవీరుల రాష్ట్ర జనరల్ సెక్రటరీ సింగం రేణుక, వైస్ ప్రెసిడెంట్ స్వరూప రాణి, ఇతరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సైడ్ కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ యూఐ మండల జనరల్ సెక్రటరీ చీకటి ప్రశాంత్ అధికారులను కోరారు. శుక్రవారం నాడు కాట్రపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి అక్రమ కట్టడాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్రపల్లి నుంచి భవాని గడ్డ తండాకు వెళ్లే ప్రధాన కూడలి దగ్గర అక్రమంగా ఆర్అండ్ బీ రోడ్డుపై ఇల్లు నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే సైడ్ కాల్వపై కొంతమంది వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నల్లాను పూడ్చి కరెంటు పోలును సైతం ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

### కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** పర్యావరణ పరిరక్షణలో వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. వాసవి క్లబ్ వరంగల్ వారి సీడ్ బాల్ తయారీ సామాగ్రి విత్తనాలు, పురుగు మందు, ఎరువు, నల్ల మట్టి, ఎర్ర మట్టి సహకారంతో సెక్రటరీ, పల్లెర్ల వీరన్న సారధ్యంలో విశ్వవిద్యాలయ ఆడిటోరియం ప్రాంగణం లో జాతీయ సేవా పథకం వలంటీర్లచే తయారు చేయబడిన "సీడ్ బాల్స్"ను పరిశీలించి ఆవిష్కరించారు. సమజహిత కార్యక్రమం చేపట్టినందుకు క్లబ్ బాధ్యులను అభినందించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి "కోటి సీడ్ బాల్స్ వరల్డ్ రికార్డు" కోసం కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం వలంటీర్లచే 20,100 సీడ్ బాల్స్ ను తయారు చేయించి, ఆ వరల్డ్ రికార్డులో క్లబ్ తో పాటు, కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం వలంటీర్లను భాగస్వామ్యం చేసినందుకు అభినందనలు తెలిపారు. రల్డ్ రికార్డుకు సంబంధించిన విట్ నెస్ స్టేట్ మెంట్ ను సెక్రటరీ పల్లెర్ల వీరన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం తరపున జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, అవెన్యూ ప్లాంటేషన్ ఇంచార్జ్ డాక్టర్ పి.వెంకటయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ టి.రాధిక పాల్గొనగా, వాసవి క్లబ్ వరంగల్ బాధ్యులు పుల్లూరు కిషోర్, ప్రొఫెసర్ గుంటూరు వెంకటనారాయణ, వల్లాల నాగేశ్వర్ రావు, పిన్నా ఈశ్వర్, వేనిశెట్టి ఉమా మహేశ్వర్ రావు, తాటిపల్లి రామచంద్రం, అప్పుని జయప్రకాశ్, గుమ్మడవెల్లి సత్యనారాయణ, మానేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొనగా, అతిథులను తులసి మొక్క, శాలువా తో సత్కరించుకున్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజ్ వల్లాల సంధానకర్తగా వ్యవహరించారు.

## పర్యాటకంతోనే ఉపాధి అవకాశాలు

### హనుమకొండ జిల్లా డీపీఆర్వో భానుప్రసాద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పర్యాటకం ద్వారానే అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని హనుమకొండ జిల్లా డీపీఆర్వో భానుప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 పురస్కరించుకొని శుక్రవారం హరిత హొటల్ లో పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భాను ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. వాటి అభివృద్ధికి కృషి చేస్తూ, పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం జరుగుతున్నదని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువ టూరిజం క్లబ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వరంగల్ యువ టూరిజం క్లబ్ రిజిస్ట్రేషన్ లో రెండవ స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఖిలా వరంగల్ లో హెరిటేజ్ వాక్, పర్యాటక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గంగాదేవి పల్లిలో కూడా పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. అనంతరం హరిత హొటల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక రంగం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పర్యాటక రంగం, శాంతి అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం తాడురి రేణుకా శిష్య బృందం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వల్సపైడి వ్యాఖ్యాతగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో హరిత హొటల్ శ్రీనివాస్, అకౌంటెంట్ కుమారస్వామి, మార్కజీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రామారావు, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ శ్రీనివాస్, పర్యాటక సిబ్బంది పాల్గొన్నారు.

## అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పోరండ్ల కృష్ణ ప్రసాద్

### ప్రధాన కార్యదర్శిగా కందికట్ల ప్రశాంత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా అఖిల భారత యువజన విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కమలాపూర్ మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామానికి చెందిన పోరండ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పెగడపల్లి గ్రామానికి చెందిన కందికట్ల ప్రశాంత్ ను నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం శనివారం నియామక పత్రాలను అందజేశారు. మర్రిపెల్లిగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గా పనిచేసిన పోరండ్ల కృష్ణ ప్రసాద్ గత రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పద్మశాలి యువజన విభాగాన్ని బలోపేతం చేయడానికి జిల్లా పగ్గాలను అప్పగించడం జరిగింది. నూతనంగా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కమిటీకి సహకరించిన జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వద్నాల నరేందర్, రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, కమలాపూర్ మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, పోరండ్ల రమేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, పద్మశాలీల సమస్యల సాధన కోసం కుల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.



## కార్పొరేట్ శక్తులకు పాలకులు దాసోహం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహం అయి దేశ సంపదను దోచిపెడుతూ విధానాలను రూపొందిస్తున్నారని ఎస్కేఎం రాష్ట్ర జిల్లా నాయకులు గోనె కుమారస్వామి, సోమిడి శ్రీనివాస్, మహమ్మద్ ఇస్మాయిల్, రాచర్ల బాలరాజు ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేఎం) పిలుపు మేరకు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద కార్పొరేట్ శక్తుల వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించే రైతన్నలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఆదుకొని ప్రభుత్వాలు ఎలాంటి కాయకష్టం చేయని కార్పొరేట్ వర్గాలకు మాత్రం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని రాయితీలుగా ప్రకటిస్తూ విధానాలు రూపొందిస్తూ సేవ చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రైతులకు మద్దతు ధర, రుణ విముక్తి చట్టాలను చేయాలని మార్కెట్ దోపిడిని అరికట్టాలని పోరాడుతుంటే పట్టించుకోకుండా పెట్టుబడుదారులకు అనుకూలమైన నల్ల చట్టాలను తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రైతు వ్యతిరేక చట్టాలను ప్రభుత్వాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాల నాయకులు సుంచు జగదీశ్వర్, ఎగ్గని మల్లికార్జున్, రవి, కొమురయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి

### కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

### కార్మిక చట్టాలు అమలు చేయాలి

### సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు పని భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, కార్పొరేట్ శక్తులకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి, యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా, కార్మికులను బానిసల్లా మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెచ్చిందని ఆరోపించారు. ఇక కార్మికులు 12 గంటలు పని చేసే విధంగా, లేబర్ కోడ్లు అమలుకు రూల్స్ రూపొందిస్తున్నారని ఉప్పలయ్య విమర్శించారు. గత పది సంవత్సరాలపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలతోనే కార్మికులు ఓటు అనే ఆయుధంతో బీజేపీకి తగిన బుద్ధి చెప్పి 63 ఎంపీ సీట్లల్లో ఓడించినప్పటికీ బుద్ధి రాలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను ఏ మాత్రం పట్టించుకోనందునే ఆ పార్టీ కోలుకోలేని విధంగా ఓడిపోయిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల మాదిరిగా కాకుండా ప్రజలకు, కార్మికులకు మేలు చేస్తారన్న నమ్మకంతోనే గెపించిన విషయాన్ని మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు యాస బాబు, సీఐటీయూ నాయకులు మాతంగి నవనీత, కాజీపేట మండల అధ్యక్ష కార్యదర్శులు రెంటాల కోటి, ఎర్ర నరేష్, హసన్ పర్తి మండల అధ్యక్షులు కార్యదర్శి రేణిగుంట్ల సురేష్, నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మారపాక అనిల్, ఇమ్మడి సాగర్, జవాన్లు సుధాకర్ రెడ్డి, సతీష్, మౌనిక, శ్రీనివాసు, కరుణ, మంద సువర్ణ, మంద చిన్ని, రోహిత్, కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కార్మికుల డిమాండ్లతో కూడిన మెమోరాండంను జిల్లా జాయింట్ కలెక్టర్‌కి అందజేశారు.

## జంక్షన్ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుందరీకరణలో భాగంగా ఎల్కతుర్తి జంక్షన్ నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళికను త్వరిత గతిన రూపొందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో ఎల్కతుర్తి జంక్షన్ నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులపై కుడా, రెవెన్యూ, మున్సిపల్, ఆర్టీసీ, ఇతర అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిలో ఉన్న ఎల్కతుర్తి మండల కేంద్రంలో జంక్షన్ నిర్మాణం, సుందరీకరణ, అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా ప్లానును అధికారులు సమన్వయంతో రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు.. ఆంటీరాబిస్ టీకాలు

### ఘనంగా ప్రపంచ రేబిస్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రపంచ రేబిస్ దినోత్సవన్ని పురస్కరించుకొని శనివారం వరంగల్ నగరం రంగశాయిపేటలోని పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా ఆంటీరాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టరు స్థానిక రంగసాయిపేట పశువైద్య అధికారి డాక్టర్ ఝాన్సీ, వీఏఎస్ హసీనా బేగం, వీఏ వీరమ్మ, ఓఎస్ రమేష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దామర కొండ కరుణాకర్, పూసల కిరణ్, దేవులపల్లి మధు, కమలాకర్, సునీల్, వలుపదాసు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### చింతగట్టులో..

ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతగట్టు పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఆంటీరాబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో చింతగట్టు వెటరినరి లైవ్ స్టాక్ ఆఫీసర్ బింగి సురేష్, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

## ఎంజీఎం సూపరిండెంట్‌కి ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇటీవల ఎంజీఎం సూపరిండెంట్ గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన డాక్టర్ చిలుక మురళిని వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆధ్వర్యంలో శనివారం శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్ కిషన్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో పేదలకు వైద్య సదుపాయాలు అందించడంలో సహకరిస్తామన్నారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా సూపరిండెంట్ చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, జిల్లా బాధ్యులు గద్దల రాజు, శంకేసి రాజేష్, యూసఫ్, గణేష్, ఎంజీఎం యూనిట్ బాధ్యులు యాదగిరి, నాగేశ్వరరావు, కిషన్, రమేష్, గోపి, వినోద్, శివన్నారాయణ, జిల్లా సంఘ నేతలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కోదండరామ్, విమలక్క, వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరెమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నేను భాగస్వాముడిని అయినందుకు గర్వపడుతున్నానని అన్నారు. ఎంతోమంది వారి పిల్లలను, కుటుంబ సభ్యులను కోల్పోయారు. చాలా మంది ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ కోసం అహర్నిశలు తపించి పోరాడిన తెలంగాణ ఉద్యమంలో మేము భాగస్వాములమేనని, ఉద్యమానికి ప్రాణం పోసి ఉద్యమంలో పాల్గొని ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా నిలబడి కొట్లాడామన్నారు. ఎన్నో కేసులు కుటుంబంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలకు వెన్నుచూపకుండా ముందడుగు వేశామని గుర్తు చేశారు. తెచ్చుకున్న తెలంగాణ భాగస్వాములైన ఉద్యమకారులందరికి ఉద్యమాభివందనాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులు కూడా తెలంగాణ ఉద్యమకారులను తప్పకుండా కాపాడుకుంటారని డాక్టర్ రామకృష్ణ అన్నారు. తెలంగాణ 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మల్హర్‌లో కలెక్టరు రాహుల్ శర్మ సుడిగాలి పర్యటన

**వరంగల్ వాయిస్, మల్హర్ :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా బొగ్గులవాగు ప్రాజెక్ట్ నీటిని నింపేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం మల్హర్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. పాత రుద్రారం ఊర చెరువు విస్తరణ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఊర చెరువు నుంచి బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు అనుసంధానం చేస్తూ నీటిని తరలించేందుకు ఇరిగేషన్, అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి రుద్రారం ఊర చెరువుకు, ఊర చెరువు నుండి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కు నీటిని తరలించేందుకు కాలువలు, ఎత్తిపోతల అవసరతపై అధికారులు సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. బొగ్గులవాగు ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారిత ప్రాజెక్టు అని, అలాకాకుండా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నదిజలాలను బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు తరలించడం ద్వారా బొగ్గుల వాగు ప్రాజెక్టు కింద అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. అనంతరం తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల





గనిని పరిశీలించి తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ నుంచి గణపురం మండలం చెల్పూరు కేటీపీపీకి బొగ్గును తరలించడానికి ఏర్పాటు చేయబోయే కన్వేయర్ బెల్ట్ గురించి జెన్కో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల గని నుంచి చెల్పూర్ కేటీపీపీకి ప్రస్తుతం 68 కిలోమీటర్ల దూరం ఉంటుందని కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయడం వల్ల 17.2 కిలోమీటర్ల దూరం మాత్రమే వస్తుందని రవాణా భారం తగ్గుతుందని తెలిపారు. అంతకుముందు తాడిచర్ల ఎస్సీ కాలనీ ఆర్ అండ్ ఆర్ స్థలాన్ని పరిశీలించారు. తదపరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. జూనియర్ కళాశాలలో ఫ్లోర్ మొత్తం దెబ్బతిన్నదని మరమ్మతులు నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న కిచెన్ షెడ్ పూర్తి చేయుటకు అలాగే కళాశాల ప్రారంభం నుంచి లోపలి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ సిద్దయ్య, తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32వ డివిజన్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన భగత్ సింగ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి ముఖ్యఅతిథిగా పాల్గొని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలని, పట్టుదలతో జీవితంలో ముందుకు వెళ్లాలంటూ పల్లం పద్మ రవి యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరిగే శ్రీను, కొండ రాజు, శ్రీనురి శ్రీధర్, ఎ.శ్రీను, బండి భాస్కర్, బ్రహ్మం, పోతు తిరుపతి, గౌడ సందీప్, అంకుష్, నీలం వినీత్, యాదగిరి, రమేష్, రామ రజిత, స్వప్న, బిఆర్ నగర్ సునీత, డాక్టర్ రాజమౌళి, ఐలయ్య మేస్త్రి, మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ ఫ్యాన్ వార్ షురూ..

ఎన్టీఆర్ ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన దేవర సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాకు వచ్చిన బజ్ నేపథ్యంలో భారీ అడ్వాన్స్ బుకింగ్స్ నమోదు అయిన విషయం తెల్సిందే. దాంతో సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయని అంతా ఫిక్స్ అయ్యారు. ఇక ఇప్పుడు డే వన్ రికార్డుల మీద చర్చలు జరుగుతున్నాయి. దీనికి తోడు దిల్ రాజు కూడా కలెక్షన్ల మీద స్పందించాడు. నైజాంలో టాప్ 2 ప్లేసులో ఉండేలా కనిపిస్తోందని చెప్పుకొచ్చాడు. ఇక డే వన్ కలెక్షన్ల మీద చర్చలు అయితే జరుగుతున్నాయి.

జూనియర్ ఎన్టీఆర్ ఆరు సంవత్సరాల తర్వాత సోలో హీరోగా వచ్చిన సినిమా అవ్వడంతో దేవర సినిమాకి విపరీతమైన బజ్ క్రియేట్ అయింది. పాన్ ఇండియా రేంజ్‌లో సినిమాను భారీ ఎత్తున విడుదల చేశారు. నార్త్ ఇండియాలో సినిమా ప్రమోషన్స్‌లో ఎన్టీఆర్ బాగానే చేశాడు. కానీ అక్కడ మాత్రం అంత హడావిడి కనిపించడం లేదు. తమిళంలోనూ దేవర హడావిడి ఎక్కువగా లేనట్టే కనిపిస్తోంది. ఇక దేవరకు తెలుగు రాష్ట్రాలు, ఓవర్సీస్‌లో అయితే మంచి ఓపెనింగ్స్ వచ్చినట్టుగా తెలుస్తోంది. అదనపు షోలు, విపరీతంగా టికెట్ రేట్ల పెంపుతో మొదటి రోజు రికార్డ్ స్థాయిలో వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం ఈ సినిమా మొదటి రోజు 140 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టేలా కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాక 70 కోట్ల గ్రాస్ వచ్చి ఉంటుందని తెలుస్తోంది. ఓవర్సీస్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కలెక్షన్లను చూసుకుంటే ఈ మూవీకి డే వన్ మంచి రికార్డులే వచ్చేలా కనిపిస్తోంది. ఇక డే వన్ విషయంలో ఆర్ఆర్ఆర్ తరువాత దేవర ఉంటుందని అంటున్నారు. కల్కి, సలార్‌లు కూడా పక్కకి వెళ్లాయని ఎన్టీఆర్ ఫ్యాన్స్ అంటున్నారు. దీంతో మళ్లీ ఫ్యాన్ వార్ షురూ అయింది. కల్కి, సలార్‌లు బుకింగ్స్ ట్రెండ్.. దేవర బుకింగ్ ట్రెండ్స్ చూస్తే ఏ సినిమా ఎంత వచ్చిందో అర్థం అవుతుంది.. ఇంతలా కలెక్షన్లు ఫేక్ చేసి చెబుతున్నారేంటి? అని ఫ్యాన్ వార్ షురూ అయింది. ఎన్టీఆర్ దేవర అయితే డే వన్ వంద కోట్లకు పైగా గ్రాస్ సాధించింది అని అందరూ అంటున్నారు. కానీ ఇంత వరకు నిర్మాణ సంస్థ నుంచి అయితే ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.

అరవింద సమేత వరకు కూడా ఎన్టీఆర్‌కు వంద కోట్ల గ్రాస్ పడలేదు. కానీ దేవరతో ఇప్పుడు డే వన్ వంద కోట్లు కొట్టేస్తాడని తెలుస్తోంది. దేవర లెక్కల మీద అయితే మున్ముందు మరింతగా చర్చలు జరుగుతాయని తెలుస్తోంది. ఓవర్సీస్‌లో మరీ ముఖ్యంగా డే వన్, ప్రీమియర్స్ కలిపి రెండున్నర మిలియన్ల డాలర్లను కొల్లగొట్టినట్టుగా తెలుస్తోంది. సినిమాకు మిక్స్డ్ టాక్ రావడంతో వీక్ డేస్ ఈ సినిమా రిపోర్ట్ ఎలా ఉంటుందో చూడాలి.




## అలా చూసి నా మతి పోయింది

### జాన్వీ బాయ్‌ఫ్రెండ్ కామెంట్ వైరల్..

ఇక ఈ చిత్రంలోని జాన్వీ కపూర్ నటనపై ఆమె బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహరియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ఈ మూవీని చూసిన అతడు జాన్వీ నటనకు ఫిదా అయినట్లు తెలిపాడు. తెరపై ఆమె అప్పియరెన్స్ కు మతిపోయినట్లు పేర్కొన్నాడు. సింప్లీ సూపర్బ్ యాక్టింగ్ అంటూ ప్రశంసలు కురిపించాడు. "నేనేమైనా కలగంటున్నానా?" అంటూ మూవీలోని జాన్వీ ఫొటోను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు.

దీంతో ప్రస్తుతం అతని పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, శిఖర్ పహరియా... మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే మనవడు అనే విషయం తెలిసిందే. గత కొంతకాలంగా జాన్వీ కపూర్ అతనితో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ జంట తరచూ బాలీవుడ్లో జరిగే పార్టీలకు హాజరవుతుంటారు.



# రకుల్ హిందీ షూటింగ్ రద్దు

### డైరెక్టర్‌కు అస్వస్థత

కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీభామ రకుల్ ప్రీత్ సింగ్. హీరోయిన్‌గా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో టాలీవుడ్‌లో మంచి బ్రేక్ అందుకుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడిరగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ తెలుగు సినిమాలో కనిపించక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపైనే ఫోకస్ పెట్టింది. ఈ భామ అజయ్ దేవ్‌గన్, టబు ప్రధాన పాత్రలు పోషిస్తున్న దే దే ప్యార్ దే 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ కొన్ని రోజులుగా పాటియాలో జరుగుతుంది. అయితే అనుకోకుండా సినిమా షూటింగ్ రద్దయినట్టు ఓ వార్త బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం మూడీ డైరెక్టర్ అన్షుల్ శర్మ అస్వస్థతకు లోనవడంతో రెండు రోజులపాటు చిత్రీకరణ నిలిపేసినట్టు తెలుస్తోంది. అన్షుల్ వర్మ డెంగ్యూ అని నిర్ధారణ కాగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. అన్షుల్ శర్మ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సినిమా మరో నెలపాటు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. దే దే ప్యార్ దే 2 షూటింగ్ మళ్లీ నవంబర్‌లో మొదలు కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. రకుల్ ప్రీత్ సింగ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 3 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.





## ఓటీటీలోకి వచ్చేసిన భలే ఉన్నాడే మూవీ

ఇటీవల పురుషోత్తముడు, తిరగబడరా సామి అంటూ వరుస చిత్రాలతో పలకరించిన రాజ్ తరుణ్ తాజాగా నటించిన భలే ఉన్నాడే సినిమా పక్షం రోజులకే డిజిటల్ స్ట్రీమింగ్‌కు రెడీ అయింది. సెప్టెంబర్ 13న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. గీత సుబ్రహ్మణ్యం' సిరీస్‌తో ట్రెండ్ సృష్టించిన దర్శకుడు శివ సాయి వర్ధన్ ఈ మూవీతో వెండితెరకు పరిచయమయ్యాడు. మనీషా కందుకూర్ హీరోయిన్‌గా నటించగా అభిరామి, హైపర్ ఆది, సింగీతం శ్రీనివాసరావు, లీలా శాంసన్, గోపరాజు రమణ వంటి నటులు కీలక పాత్రల్లో నటించారు. కథ విషయానికి వస్తే.. రాధ (రాజ్‌తరుణ్) వైజాగ్‌లోని ఓ మధ్యతరగతి కుర్రాడు.శారీ డ్రేపర్ (ఫంక్షన్‌లో అమ్మాయిలకు చీర కట్టే వృత్తి) పని చేస్తుంటాడు. తల్లి గౌరి( అభిరామి) బ్యాంక్ ఉద్యోగి. కృష్ణ (మనీషా కంద్కూరు) మోడ్రన్ గర్ల్. ప్రేమ, పెళ్లి విషయాల్లో కొన్ని ఆలోచనలతో ఉంటుంది. అయితే రాధను చూడకుండా, ఎవరో తెలియకుండానే శారీ డ్రేపర్‌గా ఉన్న పరిచయంతో రాధతో ప్రేమలో పడుతుంది. తర్వాత రాధ కూడా ప్రేమలో పడతాడు. ఓ సమయంలో కృష్ణ అవకాశమిచ్చినా రాధ హద్దు మీరకుండా పద్ధతిగా ఉంటాడు. కొంత కాలానికి పెద్దల అంగీకారంతో వీళ్లిద్దరూ పెళ్లికి సిద్ధమై నిశ్చితార్థం జరుగుతున్న సమయంలో కృష్ణ స్నేహితురాలు ఆమెకు ఓ విషయం చెబుతుంది. దీంతో కృష్ణకు రాధ వ్యక్తిత్వంపై అనుమానం ఏర్పడి రాధ సంసారానికి పనికొస్తాడా లేదా అని పరీక్షించడానికి ప్రయత్నం చేస్తుంది. తర్వాత ఏమైంది. పీటల దాకా వచ్చిన పెళ్లి ఎందుకు ఆగింది అనేది మిగతా కథ.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తాం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని, చెప్పిన ప్రతిమాట, ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే తీరుతామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ లో గురుద్వార్ కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను, 10 వ డివిజన్ లలో జయా నర్సింగ్ కాలేజీ, వడ్డెర కాలనీలో రూ.15 లక్షలతో అంతర్గత రోడ్లు, బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు, 54వ డివిజన్ లో కేయూసీ మొదటి గేట్ ఎదురుగా ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా రూ.5 లక్షల నిధులతో డ్రైన్ నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్లలో ప్రతి వార్డులలో రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ ల నిర్మాణం పనులు చేపడతామని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. మంజూరు చేసిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి నాణ్యత ప్రమాణాలు అమలు చేస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచమని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను, డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు నల్ల సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనివాస్, చీకటి ఆనంద్ శారద, పోతుల శ్రీమాన్, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ నెక్కొండ కిషన్, వీరగంటి రవీందర్, నలుబోల సతీష్, చీకటి ఆనంద్, గుంటి, స్థానిక నాయకులు వరుణ్ గౌడ్, నిఖిల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.






# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన కుడా చైర్మన్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పురుషుల అండర్–19 వన్ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్ ను శనివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రౌండ్స్ లో వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా స్నేహపూర్వకంగా పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు సూచిస్తూ ఎలాంటి సహాయం కావాలన్నా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, మాజీ కార్యదర్శి మారినేని ఉదయ్ భాను రావు, ఉపాధ్యక్షులు ఖాజా జమీర్, సహాయ కార్యదర్శి బస్వరాజ్ ఉపేందర్, మాజీ సహాయ కార్యదర్శి బండారి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు మట్టెడ కుమార్, తోట రాము, సభ్యులు ఎం. రామకృష్ణ, ఆర్ఎల్ ప్రణయ్, కోచ్ గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# పసునూటి న్యూరో కేర్ హాస్పిటల్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఆటో నగర్ లో న్యూరో సర్జన్ డాక్టర్ గజ్జల అభిలాష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పసునూటి న్యూరో కేర్ హాస్పిటల్ ను శనివారం గార్డియన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కాళీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ, ఈఈజీ, ఎన్ సీఎస్, అల్ట్రా సౌండ్, ఎక్స్ రే, ల్యాబ్ మొదలగు అత్యధిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో పసునూటి న్యూరో కేర్ హాస్పిటల్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాబట్టి, నగర ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలని కోరారు. అనంతరం ఇతర హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ గజ్జల అభిలాష్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసునూటి న్యూరో కేర్ హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



# దేశ సంస్కృతిని యువత కాపాడాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** మన దేశ సంస్కృతి సంప్రదాయాలను యువత కాపాడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ యువతను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ భవనంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు, సైన్స్ మేళా, యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని బయట తీయటానికి యువజన ఉత్సవాలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, యువత తలుచుకుంటే సాధించనిది ఏమీ లేదన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో పయనించాలని అన్నారు. జిల్లాలోని కళాకారులు ప్రదర్శించిన యువజన ఉత్సవాలకు మంచి స్పందన లభించింది. జిల్లాలోని కళాకారులు తమ కలలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జి సంపత్ రావు, జిల్లా యువజన క్రీడా అధికారి ఇంచార్జి తుల రవి, జిల్లా ఇతర అధికారులు, ఉద్యోగులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.






# బాధితులకు న్యాయం చేయాలి

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పోలీస్ స్టేషన్ ను శనివారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సందర్శించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, పలు కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు సీఐ జగదీష్, ఎస్ఐలు ఉపేందర్, రామ్ జీ, ట్రైనీ ఎస్ఐ కృష్ణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com